# హత్యా? ఆత్మహత్యా?

విద్యావతి ఆత్మహత్య చేసుకుందని వినగానే "ఆమె కష్టాలు యీ నాటితో అఖరు" అని నిట్టూర్పు విడిచి, ఉబికివచ్చే దుఃఖంతో కన్నీరు కార్చేడు ప్రకాశరావు. ప్రక్కనే ఉన్న నాకు యీ విషాదవార్త హృదయాన్ని క్షోభపరిచింది. యిద్దరం మోటారు సైకిలుపై పరుగెత్తాము రైలు బద్దీల వరకు.

తెగిపోయిన రక్తపూరితమైన చెల్లెలి శరీరం చూసి "ఆత్మహత్య చేసుకుంది చివరకు" అని గొల్లున ఏడ్వసాగాడు ప్రకాశరావు. ఆమె విడివడిన శరీరం, తనకు జరిగిన ఘోర అన్యాయానికి యిదే ప్రతీకారం అని ఉద్రేకంతో కందినట్లు రక్తావృతమై యెర్రబారింది. ఈ దురంత దృశ్యము చూస్తూంటే నా ఒంటిలో మంటలు బయలుదేరాయి. "ఆత్మహత్య కాదు, హత్య యిది" అని అరిచాను.

"ఇలా చనిపోతే, ఇది హత్య అని యెలా అనగలం?" అన్నాడు ప్రకాశరావు సందేహంగా.

అవును. యెలా అనగలం? అనలేము. మనిషి తనంత తాను వచ్చి రైలు వేగంగా పోతూంటే, తలబడ్డి ప్రాణాలు విడిస్తే యిది హత్య అని ఎలా అనగలం? ఈ చావు వైఖరి ఒక్కటే దృష్టిలో పెట్టుకున్నంతకాలం యిది ఆత్మహత్యగానే పరిగణింపబడుతుంది.

కాని యీ చావు ముందు జరిగిన దుర్భర దురంత విషాద జీవితం? అది ప్రజలకు అక్కరలేదూ ఆ చావు నిర్ణయించాలంటే? ఎంతగా మానసికంగా, భౌతికంగా క్షోభ పడితే ఆ జీవి ఆత్మహత్యకు బలవంతంగా సాహసిస్తుంది? ఆ క్షోభ ఆత్మహత్యకు కారణమైతే, అలా క్షోభపెట్టినవాడు ఆ ఆత్మహత్యకు కారకుడు గాడూ? అలా అయితే, అతను నిజంగా ఒక విధంగా హత్య చేసినవాడే. అందుకే నేను అరిచాను "హత్య యిది" అని.

అలా నేనొక్కణ్ణే అంటే ఎవరు వింటారు? ఎవరూ వినలేదు. తుదకు అది ఆత్మహత్య అని నిర్ణయించారు అధికారులు. విద్యావతిని జీవితాంతందాకా పీడించి పిప్పిచేసి, ఆమె చావుకు కారణమయిన ఆమె భర్త రామనరసును వదిలివేశారు శిక్షలేకుండా. ఎలాగయినా అధికారంలో ఉన్నవాడు. ఆ మాత్రం తప్పించుకోలేడూ!

నాకు బాగా తెలుసు విద్యావతికి వివాహం అయిన రోజులు. నాకు యీ వూరు బదిలీ అవడం, ఆమెకు వివాహం కావడం ఒకేసారి జరిగాయి.

తెలియని కుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు చేస్తే పెళ్ళిళ్ళయినాకగాని అందులోని గుట్టులు తెలియవు. రామనరసు బాగా చదువుకున్నవాడు. అతను పెంపుకు కుదిరాడు. అతని తల్లి నాలుగువిషయాలూ బాగా తెలిసిన మనిషి, తెలి

వైనది. అందుచేత కుటుంబంలో అంతా బాగానేవుందని విద్యావతినిచ్చి రామనరసుకు పెళ్ళిచేశారు.

విద్యావతి కాపురానికి వెళ్ళాకగాని అసలు విషయాలు ఎవరికీ అర్థంకాలేదు. పెంపుడుతల్లి తన కొడుకుతోనే అవినీతిగా ప్రవర్తిస్తుందని ఎవరనుకుంటారు? కామాంధతతో, కన్నుగానక, సాంఘిక ధర్మాలు విస్మరించి, అంత నీచప్రవర్తన యీ అభ్యుదయ నాగరిక ప్రపంచంలో ఉంటుందని ఎవరనుకోగలరు?

కాపురానికి వెళ్ళాక రామనరసు విద్యావతిని ఉపేక్ష భావంతో చూచేవాడు. యింట్లో చాకిరీఅంతా చేయించేవాడు దాసీమనిషిలా. చిన్నచిన్న విషయాలపై కోపం తెచ్చుకుని ఆమె శరీరం హూనంచేసేవాడు, వీటి కన్నిటికి మూలనుంచి దోహదమిస్తూ, రక్కసిలా ప్రవర్తించేది అతని పెంపుడుతల్లి.

తరువాత తెలిసింది ప్రకాశరావుకు, రామనరసుకు చాలా సంబంధాలు వచ్చి వెళ్ళిపోయాయని. బీదమేనరికం చేసేదేమిటి అని పై సంబంధము మంచిదేదైనా చెల్లెలికి కుదురుద్దామని అనేక ప్రయత్నాలుచేసి, చివరకు దీనిని నిశ్చయ పరిచాడు ప్రకాశరావు

రామనరసు, అతని తల్లి, కొట్టే దెబ్బలకు చాలాసార్లు శోషిల్లి మూర్ఛపోయేది విద్యావతి. భర్తఅంటే పరమదైవమని పురాతన గ్రంథాలలోని సారాంశము ఒంటబట్టిన విద్యావతికి 'యీ కష్టాలు ఏనాటికైనా గట్టెక్కుతాయని' భగవంతుని నమ్మేది. అప్పుడప్పుడు నా భార్యతో చెప్పుకునేది కొన్ని

విషయాలు భరించలేక. ఆమెద్వారా నే విన్న విషయాలు ప్రకాశరావుకు తెలియజేసేవాడిని.

ప్రకాశరావుకి ఒకరోజు కబురుపంపాను. అతని చెల్లెలి పరిస్థితి బాగులేదని ఒకసారివచ్చి యింటికి తీసుకు వెళ్ళమని. అతను వచ్చాడు. ఇంతలోనే యిలా కొంపమునుగుతుందని అనుకోలేదు.

ప్రకాశరావు రాకముందు రెండురోజులకిత్రం విద్యావతికి జ్వరంవచ్చింది. కాని ఆమెకు యింటిచాకిరీ తప్పలేదు. చాలాసార్లు నీరసంవల్ల మూర్ఛపోయేది ఆమె. అలాగే ఆ నాడు మూర్ఛవచ్చింది. యింట్లో వంటకాలేదు. మధ్యాహ్నందాకా బయట తిరిగివచ్చిన తల్లీ కొడుకులుకు యింటికిరాగానే భోజనం లేకపోయింది. వారికి ఆకలిబాధ కలిగినందుకు చావచితకమోది ఆమెపై కసితీర్చుకున్నారు.

శరీరంలో నీరసం, జ్వరం, మూర్ఛలు, ఒంటిమీద కాయలుదేరిన దెబ్బల సలుపులు ఒకేసారి ఆమెను చుట్టి పీడించాయి. ఈ బాధలనుండి విముక్తి పొందుదామని విద్యావతి ఆ నాటిరాత్రి ప్రక్కనున్న నూతిలో బడి చద్దామని ప్రయత్నించింది కనికరమున్న పొరుగింటి మనుష్యులు ఆమెను నూతిలోంచి తీసి రక్షించారు.

విద్యావతి ఆత్మహత్యా ప్రయత్నం విని ఆమె అత్తగారు మండిపడింది ఇంట్లో గుమిగూడిన సానుభూతిపరులను

బయటికి పంపించి తిరిగి ఆమెను చావచితక మోదింది "ఇంట్లో చస్తే నాకు అపవాదు. బయట చస్తే మంచిది" అని అరిచింది తన అరుపు భయంతో ఎప్పటికైనా చావకమానదనే ఊహతో ఎందుకైనా మంచిదని, ఆమె ఒంటిమీద నగలుదోచి, మందూ మాకూ యివ్వకుండా ఒకమూల పడేసింది ఆమెను.

ఇంతంత ఘోరాలు జరిగినా విద్యావతి చావు ఆత్మహత్య అని నిర్ణయించిన అధికారులుకూడా నైతికధర్మం వదిలేశారా అనిపించింది. రామనరసును వదిలేశారు నిర్దోషి అని. అతను ఎలా నిర్దోషి అయ్యేడని నా వాదన. ప్రకాశరావు యీ తర్క-వితర్కాలు మరిచి, పిల్లవాడిలా గొల్లుమని ఏడవసాగాడు. చెల్లెలి మరణానికి అతని దుఃఖం నా హృదయాన్ని గొడ్డలితో చీల్చినట్లయింది

పదిహేను రోజులు గడిచాయి. ప్రకాశరావును పోలీసు అధికారులు పిలిచారు చెల్లెలి మరణ విషయంలో తెలిసిన సంగతులన్నీ చెప్పమని. అతను వాఙ్మూలము యివ్వడానికి మా వూరు వచ్చాడు.

కేసు విచారణ జరిగింది. విద్యావతిని రామనరసు హత్య చేశాడని నిర్ణయించబడింది. హత్యానేరంపైన రామనరసుకు జీవితాంతం కఠిన కారాగార శిక్ష విధించారు.

ఈ వార్త విని ప్రకాశరావు ఆశ్చర్యపోయాడు. రామనరసుకు శిక్షపడడం నిజంగా అతనికి ఆనందకరమైన విషయమైనా యిది ఎలా జరిగింది అని అతని అనుమానం. చెల్లెలు

ఆత్మహత్య చేసుకుందని, రామనరసును వదిలివేసిన అధికారులే తిరిగి కేసు విచారణ జరిపి, అది హత్య అని నిర్ణయించి రామ నరసుకు శిక్ష ఎలా విధించారా అని ఆశ్చర్యపోయాడు

"దుర్మార్గాన్ని సన్మార్గంతో యెదిరించడం ఎంత ఉత్తమ పద్ధతి ఐనా అది యీ యుగంలో లాభంలేదు. దుర్మార్గులను దుర్మార్గంతోనే దండించాలి. వారిముందు మనం మరీ సన్మార్గంతో ఉంటే, మన అంతం వాళ్ళు చూడకమానరు" అన్నాను జరిగినదానికి ప్రస్తావనగా.

"దుర్మార్గులను దేముడు శిక్షిస్తాడు. మానవుడు దుర్మార్గంతో దుర్మార్గులను ఎదిరించడం సన్మార్గం కాదు" అన్నాడు ప్రకాశరావు.

"దైవత్వం మానవునిలోనూ ఉంది. అన్యాయాన్ని అంతం చేయడమే దైవత్వం. అలాచేయడమే దైవత్వం. అలా చేయగలిగితే, దైవత్వం వృద్ధిచెంది మానవుడు పరిపూర్ణుడౌతాడు. ఎలా అంతం చేయడం అన్నది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. న్యాయంతో అన్యాయాన్ని అంతం చేయకపోతే, అన్యాయంతోనైనా అన్యాయాన్ని నాశనం చెయ్యాలి" అన్నాను.

ప్రకాశరావు ఏకీభవించలేకపోయాడు కాని ఊకొట్టుతూ జరిగినదానికి ఆశ్చర్యంగా నాకేసి చూశాడు. అతనికి నా దగ్గర ఉన్న ఉత్తరం కాపీ చూపించాను.

"ఆనాడు సాయంత్రం నన్ను నల్లమందు తెమ్మన్నారు. ఎందుకో అని తెచ్చాను.

మా గుడిసె అరుగుపైన నేను యథాప్రకారం నా నులకమంచంపై పడుకున్నాను. రాత్రి ఒంటిగంటకు మెలకువ వచ్చి ఊరికే బయట చుట్ట కాల్చుకుంటున్నాను. రామనరసు గారి దొడ్డితలుపు చప్పుడైనట్లు వినిపించింది. తరువాత యిద్దరు మనుష్యులు ఒక మనిషిని జాగ్రత్తగా మోస్తూ రైలుపట్టాల వైపుకు వెళ్ళడం చూశాను. చీకటిగాఉన్నా ఆకారాలు గుర్తు పట్టాను. రామనరసుగారు, ఆయన తల్లి, వారింట్లో ఎప్పుడూ ఏవో గొడవలు జరగడం మామూలే నాకెందుకని ఆ విషయం ఎరగనట్లు మామూలుగావచ్చి పడుకున్నాను.

తెల్లవారగానే విద్యావతీ అమ్మగారు రైలుపట్టాలపై పడి చనిపోయారని వాళ్ళ పాలవాడు నాకు చెప్పాడు. ఇట్లు, వీరన్న."

ప్రకాశరావు ఉత్తరం చదివి అర్థంచేసుకున్నాడు. రామ నరసు యింటివెనక గుడిసెలో ఉంటున్న వీరన్ననుంచి నేనే యీ ఉత్తరం సంపాదించి, కేసు తిరిగి విచారణ చేయించాను అది నిజంకూడా.

ఈ ఉత్తరం అధికారులకిచ్చి రామనరసు యిల్లు పోలీసు అధికారులచే తనిఖీ చేయించాను. రామనరసు పరుపుక్రింద నల్ల మందు పొట్లాము కనిపించింది. విద్యావతి పడుకునే ప్రక్క బట్టలపైని నూనెమరకలు కనిపించాయి దొడ్డిలో చెత్తకుండీలో

నూనె నల్లమందు కలిపి గిలకరించిన చిన్న మట్టిపాత్రి కనిపించింది. అధికారులు అనుమానించి కేసు తిరిగి విచారణ చేశారు ఇంటి పక్కవాళ్ళు ఎంతోమంది రామనరసుకు ఎదురు తిరిగి విద్యావతి బాధలుగురించి చెబుతూ సాక్ష్యం యిచ్చారు. అందువల్ల రామనరసు విద్యావతిని, నల్లమందు నూనె యిచ్చి చంపి, రైలుపట్టాలపై రాత్రి పడవేసి, ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పైకి పుకారు పుట్టించాడని అధికారులు నిర్ణయించి, అతనికి శిక్ష విధించారు.

"తగినశిక్ష పడింది" అని ప్రకాశరావు మొదట సంతృప్తి పడ్డాడు. ప్రజలు ఆశ్చర్యపోయారు, ఇటువంటి హత్యలు జరిపే కాలాంతకుడా రామనరసు, అని అతని అవినీతి ప్రవర్తన తెలుసుకున్నవాళ్ళు అందుకుకూడా అతను తగినవాడే అన్నారు.

"ఆనాడు నేనన్నమాటలు నిజమైనాయి ఇది హత్యే" అని ఉద్ఘాటించాను.

నా ఉద్ఘాటన మౌనంగా విని జీర్ణంచేసుకున్నాడు ప్రకాశరావు. "నేను నా చెల్లెలికి పెళ్ళి చేయలేదు. ఆమెను హత్య చేశాను." అనుకుంటూ ప్రకాశరావు చేతుల్లో ముఖంపెట్టుకుని వలవలా ఏడ్చాడు. నేను అన్యాయం అణగద్రొక్కాలని చేసిన ఘనకార్యం యిలా ప్రతిఫలిస్తుం దనుకోలేదు అతనిలో.

నేను అనుమానించాను. అనుమానించినట్లే అయింది. చెల్లెలు హత్యచేయబడిందనే మనోవ్యధతో ప్రకాశరావు తరువాత చనిపోయాడు.

నేను దొంగతనంగా రామనరసు యింట్లో ఒకరాత్రి ప్రవేశించి, నల్లమందు అతని పరుపుక్రింద దాచడం, నూనె విద్యావతి పక్కపై చిలకడం, దొడ్డిలో నూనె నల్లమందు గిలికించిన ఒక మట్టిపాత్ర పారవెయ్యడం; వీరన్నచే విద్యావతిని రైలుపట్టాలపై రాత్రి పడవేసినట్లు ఉత్తరం వ్రాయించడం, మొదలైన దృశ్యాలు నా కళ్ళముందు తిరిగాయి. ఆ పనులు చేసేటప్పుడే యీ ఫలితం ఊహించలేదు.

ప్రకాశరావు మరణవార్త విన్నాక, నన్ను నేను హత్య చేసుకున్నట్లయింది. నాలోని సర్వం నిజంగా చచ్చిపోయినా నేను యింకా బ్రతికేఉన్నాను.